# పరాభవం

(కథానిక)

దీపం దగ్గర కూర్చున్న శంకరం ఆవులిస్తున్నాడు. అప్పుడే భోజనం చేసిన రామారావుగారు వాలుకుర్చీలో కూర్చుని తాపీగా పొగపీలుస్తున్నారు. వంటగదికి తాళం పెట్టి తమలపాకుల పళ్లెం తెచ్చింది కమలమ్మ.

'ఆ తపస్సేమిటిరా దీపం దగ్గర! చదువంటే సరి! ఆవులింతలూ కునికిపాట్లూనా! అలా సిగరెట్టు కాలుస్తూ చూస్తూ కూర్చోకపోతే వాడితో ముక్క చెప్పకూడదటండీ?- మీరు వాడి చదువే పట్టించుకోరు' అంటుంటూ తమలపాకుల ఈనెలు తీస్తోంది కమలమ్మ. తల్లి గోల పడలేక గొణగడం మొదలెట్టేడు శంకరం.

'ఆ గొణుగుడేమిటిరా? ఏమిటో చదివేది!' అడిగాడు తండ్రి పొగ చక్కగా బయటకు వదులుతూ,

'పౌరశిక్షణ' పొడిగా అన్నాడు శంకరం.

'పౌరశిక్షణ చదివేదేమిటి?' ఆశ్చర్యంగా అడిగారు రామారావుగారు.

'పతాకవందనం.' పేజీ వెనక్కి త్రిప్పి సరిగా చూసి చెప్పాడు శంకరం.

ఫక్కున నవ్వింది కమలమ్మ. 'పతాకవందనం చేస్తారుగాని చదవడమేమిటండీ!' తాంబూలం అందిస్తూ భర్తనడిగింది కమలమ్మ.

'ఏమిటో — ఇప్పుడన్నీ కొత్త చదువులు.'

'మీదంతా మరీ చోద్యమండీ! చదువుకి క్రొత్తా పాతా ఏమిటి?'

'ఏమిటా? హిందీభాష నొకదాన్ని ప్రవేశ పెట్టారు. మొదట కొన్ని ప్రాంతాలవారిని చదవమన్నారు. తరువాత అన్ని ప్రాంతాలవారినీ చదవమని మళ్ళీ హిందీగాని 'క్రాఫ్టు' గాని ఏదోఒకటి చదవవచ్చునన్నారు. ఒక్కొక్క విద్యార్థికి నాలుగు భాషలు చదవటానికి కూడా అవకాశాన్ని కల్పించారు. ఇదివరకు ఇంగ్లీషు ఫస్టుఫారంలో మొదలెట్టేవారు. అది పాతబడిపోయినందున ఈమధ్య ఇంగ్లీషు సెకండుఫారం నుంచీ చదవమన్నారు. మళ్ళా అది పాతబడకుండానే ఇప్పుడు ఫస్టుఫారంనుంచీ ఇంగ్లీషు చెప్పమన్నారు.'

'భేషుగ్గావుంది. ఇందులో క్రొత్తేముందండీ? ఇదివరకూ మా కిష్టిగాడు నాలుగు భాషలు నేర్చుకొన్నాడు.'

'ఆ క్రొత్త నీకు తెలియదులే, సాంఘిక శాస్త్రం, పౌరశిక్షణ, కాంపోజిటు లెక్కలు, ఇలాంటి నూతన ప్రణాళికలున్నై.'

మాటలసందున శంకరం పుస్తకమక్కడ పెట్టి మెల్లిగా పక్కమీదికి చేరుకొన్నాడు.

* * *

శంకరం పడుకొన్నాక వాళ్ళమ్మా నాన్న వాడిని గురించి ఏమేమో చెప్పుకొన్నారు. వాడికి సరిగా వినిపించలేదు. కాని రేపు వాడి మేనమామ, శారద వస్తారనీ, శారద తనకు భార్యగావటం వారి కిష్టమనీ శంకరం అర్థం చేసుకొన్నాడు. ఇంక వాడికి నిద్రపట్టలేదు. శారద ఎలా వుంటుంది? ఏమి చదువుకొంది? తనతో మాట్లాడుతుందా? ఏమి మాట్లాడాలి?- ఈ ప్రశ్నలన్నీ వాడిని బాధించినై. మర్నాటి బడికి సెలవుపెట్ట నిశ్చయించుకొన్నాక వాడికి నిద్రపట్టింది.

* * *

ఉదయం ఎనిమిదిగంటలకల్లా శంకరం రైలు స్టేషనువద్ద హాజరైనాడు. తొమ్మిదైనా బండి రాలేదు. శంకరం చాలామాట్లు రైలుపట్టాల దగ్గరకెళ్ళి తొంగి చూశాడు. కాలుకాలిన పిల్లి లాగ అటుఇటు తిరిగాడు. పదిగంటలైంది. రైలు కూత వినిపించింది. శంకరం గుండెల్లో బరిగెత్తింది రైలు. రైలు రావడం, చాలామంది దిగడం, కొంతమంది ఎక్కడం, దాని దారిన అది పోవడం జరిగింది. ఇంకా వాడిగుండె వేగం

"సుబ్బన్న"

గానే కొట్టుకుంటున్నది. వాడి మామయ్య ఎట్లా ఉంటాడు? వాడికేం తెలుసు? వాడి నాలుగో ఏట, అంటే ఎనిమిది సంవత్సరాల క్రితం వచ్చి వెళ్ళాడాయన అంతే. కాళ్ళీడ్చుకొంటూ కొంప జేరుకొన్నాడు శంకరం. ఇంట్లో కొంచెం హడావిడిగా ఉంది. లోపలికి చేరాడు. ఎవరో ఒక లావాంటావిడ 'ఏమోయ్ శంకరం జ్ఞాపకముందా?' అని పలకరించింది పెట్టె సర్దుతూ. ఈ ఎత్తుటావిడను వాడి కెక్కడా చూచిన జ్ఞాపకమే లేదు. వాడు ఎవరికోసమో వెతుక్కొంటున్నాడు మహా ఎరుగున్న వాడి లాగ. అప్పుడే స్నానంచేసి పావడా చుట్టుకొని తళుక్కుమని గబుక్కున గదిలోకి పోయిందో మెరుపుతీగె. ఇంతలోకే రామారావుగారో పొడుగాటాయనను వెంటబెట్టుకొచ్చారు. ఆ వచ్చిన మనిషి ఊరుకోవచ్చునా? అదీ లేదు. 'ఏమోయి శంకరం ఏం చదువుతున్నావు?' అన్నాడు. ఈ క్రొత్తమనుషులు తన్నెట్లా పోల్చుకొన్నారు? శంకరానికదో మాదిరిగా ఉంది. రామారావుగారు సిగరెట్టు ముట్టిస్తూ 'బడికి పోలేదేరా?' అన్నారు. ఆ ప్రశ్న వాడిమీదో పిడుగుపడ్డట్టుంది. ఇంతలోకే కమలమ్మ అందుకొన్నది.

'పెళ్ళామొస్తే ఇంకా బడెందుకు?' అందరు గవ్వలు క్రుమ్మరించిన ట్లొక్కమాటు నవ్వారు. గదిలో ముస్తాబవుతున్న శారదకానవ్వు చక్కిలిగింతలు పెట్టింది. శంకరం మెదలకుండా వాకిట్లోకి నడిచాడు.

అంతా భోజనాల గొడవలో వున్నారు. ముందుగా ముగించుకొన్న పిల్లలు నడవలో మిగిలారు. అవకాశాన్ని శంకరం చక్కగా ఉపయోగించుకొన్నాడు. ఒకరికొకరు క్రొత్తే ఐనా, అక్కడింకెవరూ లేనందున ఇద్దరికీ మాట్లాడుకోవాలనిపించింది. శంకరం శారదను కనితీరా రెండు కళ్ళతో చూస్తున్నాడు. ఎఱ్ఱని పెదవులు చిట్లించి 'అపిచ్చి చూపేమి' టన్నట్టు శారద ముఖం ప్రక్కకు త్రిప్పింది క్రింది పెదవిని పై పండ్లతో నొక్కుతూ. శంకరం కదిలిపోయినాడు. ధైర్యం చిక్కబట్టుకొని 'ఎందుకా నవ్వ' అని మెల్లిగా అన్నాడు. శారద మెదలకుండా రైల్లో కొన్న కథలపత్రిక త్రిప్పుతోంది. శంకరం దగ్గరగా వెళ్ళాడు. ప్రశ్నార్థకంగా చూసింది శారద 'నీ పేరేమిటి?' అడిగాడు శంకరం.

'తిక్క శంకరయ్య' నవ్వుతూ ముఖాన్ని రెండు చేతులతో కప్పుకొని సందుల్లోగుండా చూస్తోంది శారద.

శారద చిలిపి తనాన్ని గుర్తించిన శంకరం తన ప్రతిభ చూపదలచాడు. తాను పన్నెండో ఏట 'ఫోర్తు' ఫారం చదవడం, ప్రక్కింటి రమణమ్మ తన్ని పొగడడం శంకరానికి జ్ఞాపకమొచ్చినయ్.

'ఏం చదువుతున్నావ్?' ధీమాగా అడిగాడు.

'రుక్మిణీ కళ్యాణం'

అంటే ఎన్నోక్లాసో శంకరానికర్థంకాలేదు

'మీ ఊళ్లో హైస్కూలుందా?'

'ఆ. ఉంది'

'అక్కడేనా నువ్వు చదివేది?'

'ఛీ పాడు. అక్కడికి ఆడపిల్లలెందుకు పోతారు?'

'అయితే ఆ బళ్ళో ఆడపిల్లలసలే లేరా?'

'ఎవరో క్రైస్తవులుంటారు అంతే'

'బ్రాహ్మలెందుకు పోరూ?'

'మొగపిల్లలు పోతారు'

'ఆడపిల్ల లెందుకు పోరూ?'

'అది ఇంగ్లీషు బడి'

ఆ వూళ్ళో మిషనరీ యాజమాన్యం క్రింద హైయ్యర్ ఎలిమెంటరీ స్కూలుకుంది. దాన్నే వాళ్ళు హైస్కూలంటూ ఉంటారు.

శంకరం ఆలోచించాడు. మూడువిషయాలు తేల్చుకొన్నాడు. శారదకు ఇంగ్లీషు రాదు. భయంలేదు. ఆనందమైనది. కాని శారద ఏబళ్ళో చదివేది, రుక్మిణీ కళ్యాణం అంటే ఎంత చదువైనదీ వాడికి తెలియనే లేదు. తేల్చుకోదలచుకొని అడిగేశాడు.

'నీవే బళ్ళో చదువుతున్నావ్?'

'రామశాస్త్రిగారి బళ్ళో'

'నీ వెన్నోక్లాసు?' ప్రశ్న వెయ్యక తప్పలేదు.

శారద బుగ్గలుబికినయ్. ఆ నును బుగ్గలపై రంగు క్రమ్ముకొన్నది. చెప్పదేమోనని శంకరానికి కొంచెం అనుమానం కలిగింది. చురుగ్గా చూశాడు. శారద చెప్పింది: 'మా బళ్ళో క్లాసు

లుండవు. సుమతీ శతకం, కృష్ణ శతకం, కుమారీ శతకం తరువాత దాశరథీ శతకం. శతకాలు చదివినాక సప్తమస్కంధం, రుక్మిణీ కళ్యాణం. అవైనాక బాలరామాయణం చెబుతారు.'

శంకరానికి ఆలోచన తట్టింది. మొగ పిల్లవాడు గదూ. చప్పున శారద చెయ్యి పట్టుకొని చరచరా తన పుస్తకాల అల్మరా దగ్గరకు లాక్కువెళ్ళాడు. శారదకు అయోమయంగా ఉంది. పైగా అన్ని పుస్తకాలు చూసేసరికి ఆశ్చర్య మేసింది.

'ఇవన్నీ నీవే?'

శంకరానికి ఇప్పుడు తృప్తికలిగింది. ధీమాగా చెప్పాడు, 'ఆ, ఏమనుకొన్నావ్ ఫోర్త్ ఫారమంటే!'

'ఫోర్తుఫారం'- శారద ఈ మాట ఇంతకు ముందెప్పుడూ వినలేదు. తనకు తెలిసిన హైస్కూల్లో ఈ ఫోర్తుఫారంలేదు. అక్కడి ఎనిమిదవ తరగతి. దానికి గవర్నమెంటు పరీక్ష. ఆ ఎనిమిదో తరగతికంటె ఈ ఫోర్తుఫారం పెద్దదో చిన్నదో తెలిసికోవాలి. చురుకైన పిల్ల గనక సూటిగా అడిగింది.

'మీకు గవర్నమెంటు పరీక్షలేగా?'

'కాదు. ఇంకా రెండేళ్లు పోతే స్కూల్ ఫైనలు కొస్తాను. దానికి గవర్నమెంటు పరీక్ష.'

'స్కూల్ ఫైనల్'- ఈ మాట కొత్తగావున్న గవర్నమెంటు పరీక్షల ఆధారం చేసుకొని శారద శంకరం చదువుకు అంచనా వేసింది. ఎనిమిదో తరగతికి గవర్నమెంటు పరీక్ష. దానికి ఇంకా రెండేళ్ళుపోవాలి. అంటే శంకరం చదువు ఆరోక్లాసని నిర్ధారణ చేసింది. ఈ నిర్ణయాని కొచ్చినాక శారద శంకరాన్ని కింది నించి మీదికి చూచింది. లేత నవ్వుతో 'ఏపీ తియ్ నీ పుస్తకాలన్నీ చూదామ్' అన్నది.

తన పుస్తకాలు చూపడం శంకరానికి ఉత్సాహంగా ఉన్నా శారద చిరు పెదవుల మధ్య తొణికిసలాడే నవ్వులాంటిదే శంకరానికి భరించరాని ఆక్షేపణగా ఉన్నది. మొదట వాడు ఇంగ్లీషు పుస్తకాలు చూపించాడు. శారద నిరాదరణగా వాటిని వెనక్కు నెట్టి తెలుగు పుస్తకాలు తీసింది. తెలుగు వాచకం త్రిప్పుతూ నరసింహావతారం బొమ్మ చూసింది. పేజీ త్రిప్పి 'బాలుం డీతడు...ఇందుగల డందు లేడను సందేహము...పద్యాలన్నీ గళగ్రాహిగా ఏకరువు పెడుతోంది. శంకరాని కందులో వొప్పగించవలసిన కొన్ని పద్యాలుకూడా రావు. శారద అన్నీ వరుసగా నట్టులేకుండా వొప్ప జెప్పుకుపోతున్నది. శంకరానికి కోపమొచ్చింది. ఆ పుస్తకాన్ని లాగేసి 'ఇదిగో చూడు' అంటూ సాంఘిక శాస్త్రాన్నిచ్చాడు. శారద నోరు మూసుకొని పేజీలు త్రిప్పి దాన్ని అవతల పెట్టింది. శారదను ఎట్లా ఓడించాలో శంకరానికి కర్థమైంది. వెంటనే వాడు 'చూసుకో నా పారశిక్షణ నోట్సు' అంటూ తనకు బహుమతి వచ్చిన డ్రాయింగు పుస్తకాన్నిచ్చాడు. శారద తన లేతవ్రేళ్ళతో ఆ మొద్దు కాగితాలను త్రిప్పింది. అందులో చదువేమీ కనిపించలేదు. అంటించిన కొన్ని ఆకులు, రంగుపూసిన ఈకలు కుట్టబడిఉన్నై. ఆకుల క్రింద పేర్లు చదువుకొంటూ పోతుంది ఒకచోట ఆగి,

'పెన్సిలు కావాలి.'

'దేనికి?'

'తప్పు దిద్దాలి.'

శంకరం హృదయంలో ఎవరో బల్లెంతో పొడిచినట్లుంది.

'ఎక్కడా తప్పు?' అడిగాడు.

'ఇదిగో. యిస్తరాకు అని వ్రాశావు. విస్తరాకు అనాలి. పైగా విస్తరాకేమిటి? దీని పేరు అడ్డాకు. ఎవరికి తెలియవని ఈ పిచ్చి ఆకులు ఇక్కడ పెట్టి పేర్లు అందులోనూ తప్పు వ్రాయడం?'

శంకరానికి నీళ్ళల్లో మునిగినట్లుగా ఉంది. వాళ్ళ ట్రెయినింగు పొందివచ్చిన మేష్టారు ఆరు రకాల ఆకులు, ఆరు రకాల ఈకలు పోగుచేసి డ్రాయింగు పుస్తకంలో కుట్టమన్నారు. ఆ పని చక్కగా ముందుచేసినవారికి బహుమతీ ఇస్తామంటే తాను ఆనాడెంత కష్టపడ్డనీ; ఆరు రకాల ఆకులూ దొరక్కపోతే తన తెలివంతా ఉపయోగించి గుమ్మానికి కట్టిన తోరణంలోని మామిడాకును, వంటింట్లో చింపి తెచ్చిన ఇస్తరాకును కలిపి ఆరు రకాల ఆకులూ చేర్చిన విషయం; ఆరు రకాల ఈకల కోసం ఎన్ని సందులు తిరిగిందీ, కోడిఈకల కోసం

శరీను ఎంత బతిమాలిందీ; ప్రక్కింటి 'సాంబు'తో కలిసి ఆలోచన చేసి మెత్తని కోడి ఈకలకు ఎఱ్ఱసిరా, పచ్చసిరా పూసి క్రొత్త రకాలు సృష్టించిందీ—సకాలంలో 'ఆల్బం' అందజేసినందుకు బహుమతి పొందినప్పుడు తన కొచ్చిన సంతోషాన్నీ—ఇవన్నీ ఆ పల్లెటూరి పిల్లకు చెప్పాలిసిందేనా? లేకపోతే ఆపిల్ల ప్రశ్న కింకేమైనా సమాధానముందా? సందేహావస్థలో పడ్డాడు. చప్పున వాడికో ఆలోచన తట్టింది. అసలు దిద్దటానికి తానెందుకొప్పుకోవాలి? ఆకు లెందుకేమిటి? 'సిటిజన్ షిప్'— ఆలోచించు కొన్నాడు. వాడికి బాగా జ్ఞాపకముంది ఒక నాడు వాళ్ళమ్మ యిస్తరాకులు తెమ్మంటే వాడి నాన్న తెచ్చిన ఆకులవి. 'అడ్డాకేమిటి? నిలు వాకూను. దాని పేరు ఇస్తరాకే' అన్నాడు.

శారద పకపకా వెనక్కు విరగబడి నవ్వు తోంది. శంకరానికి కోపమొచ్చి 'నీకేం తెలు సులే. పల్లెటూరి మొద్దువి. ఇది సిటిజన్ షిప్. కావాలిసొస్తే పుస్తకం చూసుకో.' అంటూ పౌరశిక్షణ పుస్తకాన్ని శారద కిచ్చాడు.

శారద ముఖం ముడుచుకుపోయింది. శంకరం శారద ముఖం చూసి జాలిపడ్డాడు. ఊరడించా లని పౌరశిక్షణ పుస్తకం తెరిచి కొన్ని గుర్తులు చూపాడు.

'ఈ గుర్తు చూడు. ముందు కొంతమంది వెళుతూ ఈ గుర్తు వేస్తారు. వెనక వెళ్లేవారు గుర్తులు చూసుకొంటూ వెళ్ళి వాళ్ళను కలుసు కొంటారు.'

ఈసారి శారద నవ్వకుండా అడిగింది. 'ముందు కొంతమంది పోవడం దేనికి? కథలు చెప్పుకుంటూ అంతా కలిసిపోరాదూ సరదాగా?' పెద్దపెద్ద కళ్ళతో సమాధానంకోసం ఎదురు చూసింది. శంకరం ఆలోచించి నవ్వుతూ 'ఈ పాట పాడు' అన్నాడు మరో పేజీలో ఒక పాట చూపుతూ.

'రెండు కళ్ళులేవు నారాయణా
కబోది పక్షులము నారాయణ......'

ఫక్కున నవ్వి చెంగున లేచి లేడి పిల్లలాగ నడవలోకి గంతు పెట్టింది శాదర. భోజనం ముగించుకొని వాకిట్లోకి వెళ్లే తల్లి చేతులో ఆ పుస్తకాల్ని పెట్టి గట్టిగా కావులించుకొన్నది.

ఆమె విస్తుపోయి 'ఏమిటే?' అన్నది.

'బావ చదువు' ఆమె కళ్ళల్లోకి చూస్తూ చెప్పింది.

'ఆసి భడవా! అప్పుడే బావ చదువులవరకూ వచ్చావా!' అంటూ రామారావుగారొచ్చారు.

'ఇదేం చదువన్నయ్యా, అన్నీ ఆకులూ ఈకలూను' పుస్తకం త్రిప్పుతూ అడిగింది

'ఆ అచ్చు పుస్తకం చూడమ్మా' అనుర్దాగా ఆనందంతో తల్లి నడిగింది శారద.

'ఇంగ్లీషు చదువుల్లో ఉండేవి ఇవేరా!' అన్న దావిడ.

'కాదు కాదు, అవి క్రొత్త చదువులు' సమా ధాన మిచ్చారు రామారావుగారు.

శంకరానికి శారద పొడుగాటి జడను ఆ స్తంభానికి కట్టి తంతే బాగుండు ననిపించింది. మాట్లాడకుండా ఎక్కడికో పోయినాడు.

ఆ సాయంకాలం ఎలాగైనా సరే శారదను పరాభవం చెయ్యాలనే ధృఢసంకల్పంతో ఇంటి కొచ్చాడు శంకరం. నడవలో కొచ్చేసరికి ఏదో వినిపిస్తోంది.

పంచలోకి తొంగిచూశాడు. వాళ్ళమ్మ శారదను ఒళ్లో కూర్చోపెట్టుకుని వింటూన్నది. శారద తల్లి తన పౌరశిక్షణ పుస్తకాన్ని తిరగ వేస్తోంది. శారద వసారాలో 'కిచకిచ' లాడుతూ రెపరెప కొట్టుకొనే పిచ్చుక జంటను చూస్తూ, మధురంగా శ్రావ్యంగా హాయిగా కంఠం విప్పి పద్యాలు చదువుతున్నది. కమలమ్మ శారద తల నిమురుతోంది.

'ఘనుడా భూసురుడేగెనో? నడుమమార్గ శ్రాంతుడై చిక్కెనో? కృష్ణుండిని విని తప్పుగా దలచెనో...' పద్యం ముందుకు సాగిపోతోంది. శంకరం కొయ్యలాగ నిల్చున్నాడు.

'అర్థం చెప్పవేమే? అన్నది తల్లి. శారద తడుముకోకుండా తియ్యగా అర్థం చెప్పుకుపోతు న్నది. కూతురి చదువు పదిమంది ముందు ప్రద ర్శించడం శారద తల్లికెంతో సంతోషంగానూ గొప్పగానూ ఉంది. ఆ పిల్లని అందరూ మెచ్చు కొనేవారే. శంకరం ఆలోచించాడు. ఆపద్యాలు తనకూ బాగున్నై. అయితే తన చదువంటే అందరూ నవ్వేవారే. శంకరం మళ్ళా ఎక్క డికో వెళ్ళిపోయినాడు.